ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 21 సెప్టెంబరు 2024



ఎమ్మెల్సీకి పోటా పోటీ



- రంగంలోకి విద్యాసంస్థల యజమానులు
- పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- టికెట్ ప్రయత్నాల్లో నాయకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోటీ ఉండనుంది. వచ్చే మార్చిలో ఎన్నికలు జరుగనుండగా ఓటర్ల నమోదు ప్రక్రియ నుంచే ఆశావహులు దృష్టిసారిస్తున్నారు. ఎమ్మెల్సీ స్థానం పరిధి నాలుగు జిల్లాలకు విస్తరించి ఉన్నందున వీలైనంత వరకు స్వంత జిల్లాలో తమకు అనుకూలంగా ఓటు వేస్తారని భావించిన వారిని ఓటర్లుగా నమోదు చేయించడంపై ఆశావహులు దృష్టిసారిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా ఐదు నెలల గడువు ఉన్నది. పోటీలో ఉండదల్చుకున్నవారు తమ ప్రయత్నాలను ఇప్పటి నుంచే ముమ్మరం చేస్తున్నారు. బీజేపీ నుంచి ఆ పార్టీ కిసాన్ సెల్ మాజీ జాతీయ కార్యదర్శి పి.సుగుణాకర్ రావు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణా రెడ్డి, ప్రస్తుత రాష్ట్ర అధికారప్రతినిధి రాణి రుద్రమ పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ తమ ప్రయత్నాలు చేసుకుం టున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ నుంచి వెలిచాల రాజేందర్‌రావు, రోహిత్‌రావు, పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నా ప్రధానంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అందరిని కలుస్తూ మద్దతు కూడగట్టుకుంటు న్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి తనకు అనుకూలంగా అప్పుడే ప్రచారం చేపట్టేలా చూసుకోవడంతోపాటు ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులను సేకరిస్తున్నారు. దాదాపుగా ఆయనకే టికెట్ వస్తుందని కూడా పార్టీలో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లో ఐఎంఏ నాయకుడు డాక్టర్ బి.నరేందర్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, సత్యనారాయణ పేర్లు చర్చలో ఉన్నాయి. వీరంతా ఇప్పటికే తాము పోటీలో ఉంటున్నామని ప్రకటించి జిల్లాల్లోని విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, యువజన సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ పట్టభద్రులను కలుస్తున్నారు.

● **గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి** బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన దాసరి ఉష ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు బీఆర్ఎస్‌లో చేరారు. ఆమె కూడా ప్రస్తుతం ఎమ్మెల్సీ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. అదే పార్టీకి చెందిన డాక్టర్ చిరుమల్ల రాకేశ్ కూడా బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉండడానికి ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం. అయితే వీరిలో బీఆర్ఎస్ ఎవరిని అభ్యర్థిగా నిలిపే అవకాశముందో కాని బీఎన్‌రావు, రవీందర్‌సింగ్, శేఖర్‌రావు తప్పక పోటీలో ఉంటామని ప్రకటించి ఓటర్ల నమోదు చేపడుతున్నారు.

> **కాంగ్రెస్‌నుంచి** ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధిపతి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేరు ఖరారైన పక్షంలో తాము కూడా పోటీగా మరో విద్యాసంస్థకు చెందిన అధిపతిని రంగంలోకి దించాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని పోటీకి తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యేగా విస్తృత సంబంధాలుండడం, విద్యాసంస్థల అధిపతిగా విద్యారంగంలో ఉన్న వారందరికీ పరిచయమై ఉండి పట్టభద్రుల్లో ప్రభావం చూపించగల వ్యక్తిగా ఉంటారని పార్టీ భావిస్తున్నట్లు చెబుతున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని పోటీకి నిలపడం ద్వారా రెడ్డి సామాజికవర్గాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడంతోపాటు ఆ సామాజికవర్గం ఓట్లు కాంగ్రెస్‌కు ఏకపక్షంగా పోల్ కాకుండా చూసుకోవచ్చని ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. నరేందర్‌రెడ్డికి ధీటుగా పోటీలో మనోహర్‌రెడ్డి వెనుకాడే పరిస్థితి ఉండదని, కాంగ్రెస్‌నుంచి నరేందర్‌రెడ్డిని పోటీకి నిలిపితే మనోహర్‌రెడ్డినే అభ్యర్థి చేస్తారనే ప్రచారం జరుగుతున్నది.



వాహనాల 'స్టాండ్'

కరీంనగర్ శివారుప్రాంతంలోని తీగలగుట్టపల్లిలో ప్రధాన రహదారిపై ఉన్న ఆర్టీసీ బస్‌స్టాండ్ వాహనాల పార్కింగ్ స్టాండ్‌గా మారింది. ఈ రహదారి నుంచి ఆర్టీసీ బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయి. బస్సులు వినియోగించే ప్రయాణికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. బస్టాండ్‌లో వాహనాలను పార్కింగ్ చేయడంతో ఎండావానలో ప్రయాణికులు రోడ్లపైనే నిల్చునే పరిస్థితి ఉంది. దుర్శేడ్, నగు నూర్, చామనపల్లి, మొగ్దుంపూర్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. బస్టాండ్‌లో ఉండే విధంగా చూడాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

▪ కరీంనగర్ రూరల్

42శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: 42శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య పిలుపుమేరకు శుక్రవారం కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. లేనిచో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బీసీ సంఘాలు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. గత ప్రభుత్వం 33శాతం ఉన్న రిజర్వేషన్‌ను 27 శాతానికి కుదించగా రాహుల్‌గాంధీ జూడో యాత్రలో, కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం చేస్తామని చెప్పారన్నారు. వెంటనే కులగణన చేపట్టి 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నాంబ, రేణుక నాగలక్ష్మి, దేవేంద్ర, చాకలి శంకరయ్య, తోట సతీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఏజెన్సీలకు అప్పగించడం సరికాదు



సీఐటీయూ, టీబీఎన్‌కేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: భవననిర్మాణ కార్మికులకు అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అందించడం సరికాదని భవన నిర్మాణ కార్మికుల జాయింట్ ఆక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత పాక్షిక అంగవైకల్యం వంటి సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించాలని చూస్తుందన్నారు. ఇన్సురెన్స్ కంపెనీలకు కాకుండా ప్రభుత్వం బోర్డు ద్వారా కార్మికులకు అందించాలని, బోర్డు నిధులు దుర్వినియోగం కాకుండా అడ్వైజరీ కమిటీని నియమించి కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంల సిఐటియు జిల్లాకార్యదర్శి ఎడ్లరమేష్ ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, కదిరి రమేష్, పళ్ల తిరుపతి, జంబుకం వెంకన్న, రేణిగుంటసారయ్య, రావుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 20: ప్రతి మహిళ ప్రభుత్వాసుపత్రి సేవలను వినియో గించుకో వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నా రు. శుక్రవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



పెద్దపాపయ్యపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్న అంగన్‌వాడీల కేంద్రాల ద్వారా చిన్నారుల్లో మనోవి కాసం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. మాతృ మరణాలు పరిశీలిస్తే సమయం ప్రకారం వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల మరణిం చిన వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. గర్భిణీ ఆరోగ్య పరిస్థితి గురించి స్థానిక ఆరోగ్యకార్యకర్త, అంగన్‌వాడీ, ఏఎన్ఎం సిబ్బందికి ఎక్కువగా అవగాహన ఉంటుందని, వారి సమక్షంలో ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ కావడం మంచిద ని సూచించారు. ప్రతి మంగళ, గురువారాల్లో ఆరోగ్య మహిళ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మూడు నెలలకు ఒకసారి మహిళలు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల న్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతం చేసిన కలెక్టర్ గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్ర మంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో రమేష్ బాబు, జిల్లా సంక్షేమా. దికారి సరస్వతి, జిల్లా వైద్యా ధికారి సుజాత, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, సీడీపీవో సుగుణ తదితరులు ఉన్నారు.

వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం సందర్శించారు. 'ఆంధ్ర జ్యోతి' పత్రికలో 'గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు' అనే శీర్షిక వెలువడింది. దీనికి స్పందించిన కలెక్టర్ హాస్టళ్లలోని విద్యార్థులను ఆహారం మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.భోజన సమయ మార్పుల గురించి ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యార్థులకు మంచి ఆహా రాన్ని అందించాలని వార్డెన్లకు సూచించారు.

25 మంది డీటీ, ఎస్‌ఏలకు స్థానచలనం

కరీంనగర్‌టౌన్, సెప్టెంబర్20: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 25 మంది నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. కరీంనగర్ డీఎం, టిఎస్‌సిఎస్‌సిలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ టి.వైశాలిని కరీంనగర్ తహసీల్దార్ రూరల్‌కు బదిలీ చేశారు. కరీంనగర్ రూరల్ నాయబ్ తహసీల్దార్ ఎ.శంకర్‌ను జిల్లా డీఎస్‌వో కార్యాలయానికి, శంకరపట్నం నాయబ్ తహసీల్దార్ బి.రమేశ్ బాబును ఎపిక్, హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి, హుజూరాబాద్ ఎపిక్ నాయబ్ తహసీల్దార్ పి.సాయికృష్ణను శంకరపట్నంకు, ఆర్డీవో హుజూరాబాద్ నాయబ్ తహసీల్దార్ ఇ.మల్లేశంను హుజూరాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జిగా, హుజూరాబాద్ ఇం చార్జిగా పనిచేస్తున్న ఎం.ప్రేమలతను ఇల్లంత కుంటకు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎన్.సత్యనా రాయణ (మానకొండూర్)ను గన్నేరువరం, కె.బాలకిషన్ (రామడుగు)ను శంకరపట్నంకు, ఎ.శ్రీనివాస్‌రెడ్డి (శంకర పట్నం)ను కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. అయోషా రఫత్ (ఆర్డీవో కరీంనగర్) నుంచి గంగాధరకు, అమ్రిన్ (గంగాధర) నుంచి ఎస్‌డిసి ఎల్ఎ, ఆర్‌అండ్‌ఆర్, కరీంనగర్‌కు, కె.తారాదేవి (ఎస్‌డిసి, ఎల్ఎ)ను చిగురు మామిడికి, పి.శివరామకృష్ణ (చిగురుమామిడి) నుంచి రామడుగుకు, పి.రాజు (రామడుగు) నుంచి కరీంనగర్ తహసీల్దార్ కార్యాలయానికి, కె.రాఘవేందర్ (కరీంనగర్) నుంచి చొప్పదండికి, టి.త్రిపా ల్‌సింగ్ (చొప్పదండి) నుంచి మానకొండూర్‌కు, ఎండి. షఫీ మొద్దీన్ (గన్నేరువరం) నుంచి మానకొండూర్‌కు, కె.ప్రవీణ్ కుమార్ (మానకొండూర్) నుంచి గంగాధరకు, ఎల్. శ్రీనివాస్ (గంగాధర) నుంచి కలెక్ట రేట్‌కు, బి.శైలజ (కలెక్టరేట్) నుంచి రామడుగు, కె.శరత్ (సైదాపూర్) నుంచి జమ్మికుంటకు, వి.అనిల్ కుమార్ (జమ్మికుంట) నుంచి ఇల్లంద కుంటకు, డి.రవీందర్‌రావు (ఇల్లందకుంట) నుంచి ఆర్డీవో హుజూ రాబాద్‌కు, కె.రాజమధూకర్ (హుజురా బాద్ ఆర్డీవో) నుంచి సివిల్ సప్లయి ఇన్‌స్పెక్టర్ కరీంన గర్‌కు, పిఆర్ సతీష్ (సివిల్ సప్లయి)నుంచి మానకొండూర్‌కు, పి.జయ లక్ష్మి (మాన కొండూర్) నుంచి చొప్పదండికి బదిలీ అ య్యారు. జి.మోహన్‌రెడ్డి (చొప్పదండి) నుంచి సైదాపూ ర్‌కు, ఎస్.అనిల (కలెక్టరేట్)నుంచి ఇల్లంద కుంటకు, సైదా రిమిషా ఆఫ్రీన్(ఇల్లందకుంట)నుంచికలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

పనిచేయని సీసీ కెమెరాలు

- ప్రజల భాగస్వామ్యంతో జమ్మికుంటలో 65 ఏర్పాటు
- నిర్వహణలేక అస్తవ్యస్తం
- చోరీలతో ప్రజల్లో భయాందోళనలు





జమ్మికుంట గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

జమ్మికుంట, సెప్టెంబర్ 20: నేటి పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. నేరాలు జరిగిన గంటల వ్యవధిలోనే సీసీ కెమెరాల సహాయంతో ఎన్నో కేసులు ఛేదించిన సంఘటనలు ఉన్నా యి. జమ్మికుంట పట్టణంలో 2017సంవత్సరంలో ప్రజలు, వ్యాపారుల సహకారంతో పోలీస్‌లు 19ప్రధాన కూడళ్లను గుర్తించి 65సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. పట్టణంలో ఎక్కడ చోరీ, ఇతర సంఘటనలు జరిగినా పోలీసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ఏడాది కాలంగా పట్టణంలో అమర్చిన సీసీ కెమెరాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో వాటి పనితీరు అస్తవ్యస్తంగా మారింది. కేబుల్స్ కట్‌కావడం, సెటప్‌లు కాలిపోవడం, వర్షం నీరు చేరి పనిచేయకుండా అవి పోయాయి. సీసీ కెమెరాలు అమర్చిన కంపెనీ మూడు సంవత్సరాల వారంటీ ఉండటంతో 2020వరకు సర్వీస్ అందించాయి. ఆ తర్వాత వాటి మెయింటనెన్స్ కోసం డబ్బులు చెల్లించాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి.

● **పలుచోట్ల కెమెరాలు మాయం**

జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు కనిపించడం లేదు. కృష్ణాకాలనీ చౌరస్తాలో అమర్చిన నాలుగు సీసీ కెమెరాలు, పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండు కెమెరాలు, సువర్ణ ఫంక్షన్‌హాల్ వద్ద నాలుగు కెమరాలు చోరీకి గురయ్యాయి. ఈ మూడు ప్రాంతాలే కాకుండా మరి కొన్ని చోట్ల కూడా సీసీ కెమెరాలు లేవని తెలుస్తోంది.

● **ఒకే ఇంట్లో రెండు సార్లు చోరీ**

జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ (బుడ్డగిర్నీ) రోడ్డులో గల ఓ బజ్జిల బండి వ్యాపారి ఇంట్లో కొద్ది నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. నెల రోజుల క్రితం అదే ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి రెండో సారి చోరీకి పాల్పడ్డారు. అప్పటికి ఆ ఇంట్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవడంతో రెండోసారి చోరీకి పాల్పడ్డ దొంగ దొరికాడు.

● **బస్టాండ్‌లో నిత్యం చోరీలు**

జమ్మికుంట ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం చోరీలు జరుగుతుండటం పరిపాటిగా మారింది. బంగారు గొలుసులు, పర్సులు, నగదు, సెల్‌ఫోన్లు, కార్గో కొరియర్‌లో వస్తున్న వస్తువులు చోరీకి గురవుతూ ఉన్నాయి. ఇటీవల కార్గో కొరియర్‌లో వచ్చిన కారు టైర్లను బయట పెట్టగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో దర్యాప్తులో పోలీసులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే వీణ వంకలో ఓ సీసీ కెమెరాలో టైర్లు ఎత్తుకెళ్లిన దృశ్యాలు గుర్తించడంతో పోలీసులు దొంగను పట్టుకున్నారు. ఇప్పటికైనా సీసీ కెమెరాలపై దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



జమ్మికుంట గాంధీ చౌరస్తా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 20: మండలంలోని మర్రివానిపల్లె గ్రామంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామానికి చెందిన మండ సురేష్ (35) జమ్మికుంట మండలంలోని కొత్తపల్లిలో ప్రైవేట్ కారు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం కొత్తపల్లి నుంచి బైక్‌పై తన బంధువుల ఇంటికి ఇల్లందకుంట మండలంలోని మర్రివానిపల్లె గ్రామం మీదుగా వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సురేష్ తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత


గోశాలకు తరలించిన పశువులు

చిగురుమామిడి, సెప్టెంబరు 20: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్(టీజీ07 యూ 2943)ను పట్టుకున్నట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. కొండాపూర్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్‌లో ఐదు ఎద్దులు, మూడు ఆవులు, రెండు దూడలు ఉన్నాయి. వ్యాన్ డ్రైవర్ సాధిక్ ఖురేషిని విచారించగా పశువులను హుస్నాబాద్ సంతలో కొనుగోలు చేసి హైదారా బాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పాడని తెలిపారు. దీంతో అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు యజమాని సాజిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పశువులను గ్రామంలో ఉన్న గోశా లకు తరలించామని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు


గాయపడ్డ కుమారస్వామి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి కుమారస్వామి గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఛాతి, కడుపు, భుజం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానసిక దివ్యాంగులకు తోడ్పాటునందించాలి


ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న నరహరి

తిమ్మాపూర్, సెప్టెంబరు 20: మానసిక దివ్యాంగులకు మనవంతుగా తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తి నివ్వాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశా లను శుక్రవారం నరహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటుగా ఇతర జిల్లాలో కూడా ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైనా సహాయార్థులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకొస్తున్న తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్‌కు ఆర్థికంగా సహాయ, సహకారం అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి సహకా రంతో పాఠశాలకు సంబంధించిన సామగ్రి కోసం అవసరమైన 30వేల రూపాయల చెక్‌ను ప్రిన్సిపాల్ సతీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తిట్ల రమేశ్, మిట్టపెల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, కళ్యాణ్ చంద్రశేఖర్, ఉమేశ్వర్, పి రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన ఒకరి రిమాండ్

వీణవంక, సెప్టెంబరు 20: ఓ బాలికను లైంగికంగా వేధించిన మైనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. వీణవంక మండలానికి చెందిన బాలిక(11)ను వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నియామకం


మధుజాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శిగా గుమ్మడి మధు జాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు జాన్సన్‌ను 2023-2024 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు జాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, బి మదన్‌మోహన్ రావు, ఎ నిర్మల, ఆల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, జిజెఎల్ అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, సెప్టెంబరు 20 : సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం అధ్యాపక పోస్ట్ (పీజీటీ- కెమిస్ట్రీ) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి(హెచ్ బీటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ చేసి టెట్ క్వాలిఫై అయి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బోధన ఆధారంగా గరిష్ఠంగా 18,200 రూపాయల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు బండారి సంపత్‌కుమార్ 9014964242 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీన్ దాసరి శ్రీనివాస్

రామడుగు, సెప్టెంబరు 20: వ్యవసాయానికి అనుబంధంగా పెరటి కోళ్ల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని కోరుట్ల వెటర్నరి కాలేజ్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని షానగర్, శ్రీరాములపల్లి, రామడుగు గ్రామాల్లోని వందమందికి శుక్రవారం పీవీఎన్ఆర్ వెటర్నరి యూనివర్సిటీ కోరుట్ల వెటర్నరి కాలేజ్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ లబ్ధిదారులకు పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. డీవీఏహెచ్‌వో కార్యాలయ ఏడీ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాంబాబు ఉన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, సెప్టెంబరు 20: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన తెలుగు భాషోపాధ్యాయ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉన్నందున తొమ్మిది గంటలకు హజరు కావాలని ఆదేశాలు ఉన్నాయి. కాగా మండలంలోని మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు కే రాజేశ్వరీ, అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కే శ్రీవాణి, పచ్చునూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జి అంబిక, ఈదులగట్టెపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు కే యువరాజు 10.20గంటలకు హాజరయ్యారు. దీంతో వీరందరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

సిధారెడ్డికి 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారం

● తెలంగాణ భాషకు పట్టం కట్టిన సిధారెడ్డి ● పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్


నందిని సిధారెడ్డికి జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 20 : ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డికి బుర్ర నరసమ్మ లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని శుక్రవారం కరీంనగర్‌లో అందజేశారు. వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కార గ్రహీత సిధారెడ్డి మాట్లాడారు. బాధలు-గాయాలే కవిత్వాన్ని పండిస్తాయన్నారు. మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణలని. అమ్మానాన్నల దీవెనలే మన అస్తిత్వమని అన్నారు. జీవితంలో అనుభవించే కన్నీళ్లే సాహితీవేత్తలకు సిరా చుక్కలని పేర్కొన్నారు. కష్టాల లోతుల్లోంచి జీవిత సత్యాలుకవిత్వ రూపంలో ఉబుకు తాయని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ సమాజహితం కోరే సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజలను మేల్కొలుపుతూ నిస్వార్థంగా అక్షర సేద్యం చేస్తున్నారని అన్నారు. సిధారెడ్డి నిస్వార్థ నిరాడంబర నిక్కచ్చి జీవితం నేటి యువతకు దారి దీపంగా నిలుస్తుందని కొనియాడారు. తన అమ్మానాన్నల పేరిట జాతీయస్థాయి పురస్కారం అందిస్తున్న డాక్టర్ మధుసూదనరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, విమర్శకుడు, రచయిత దాస్యం సేనాధిపతి, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సంస్థ అధ్యక్షుడు, పురస్కార ప్రదాత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల గణన తర్వాతనే వర్గీకరణ జరగాలి


అభివాదం చేస్తున్న బేడబుడిగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20 : కుల గణన చేసిన తరువాతనే వర్గీకరణ జరగాలని తెలంగాణ బెడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరపాటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్రస్థాయి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరపాటి వేణు మాట్లాడారు. మాల మాదిగలతో కలపకుండా బెడ బుడగ జంగాల ఉప కులాలను ఏ జాబితాలో చేర్చాలని, తమకు ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొందన్నారు. దానిని అమలు చేయాలని, చైర్మన్‌గా బెడ బుడగ జంగాలనే నియమించాలని, పదివేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తం పేరుతో రూ. 12లక్షలు ఇస్తామని ప్రకటించిందని, దానిని వెంటనే అమలు చేసి, 40శాతం బెడ బుడగ జంగాలకు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాత జనాభా ధామాష ప్రకారం బేడ బుడగ జంగాలకు రాబోయే రోజుల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయిం చాల న్నారు. బెడబుడగ జంగాలకు చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బెడబుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ. 12వేల ఫించను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావే శంలో గౌరవాధ్యక్షుడు తురుపాటి లింగ య్య, ప్రధాన కార్యదర్శి పస్తం ఆంజనేయులు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పాశర్లపూడి లక్ష్మీ, పస్తం పరశురాములు, డొక్క రాజేశ్, పత్తి బాషశివ, మొటం నాగార్జున, మొటం రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు..

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

గన్నేరువరం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మంగళారపు రాయమల్లు(55)కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివా హం చేశాడు. రాయమల్లుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అదే గ్రామానికి చెందిన పుల్లెల తిరు పతి వద్ద గతంలో లక్షా యాభైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని రాయ మల్లుపై తిరుపతి పలుమార్లు ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో పుల్లెల తిరుపతి ఖాళీ బాండ్ పేపర్‌పైన రాయమల్లు సంతకం తీసుకున్నాడు. ఆ తరువాత ఖాళీ బాండ్ పేపర్‌లో రాయమల్లుకు చెందిన వ్యవసాయ భూమిని అమ్మినట్లుగా ఇందుకు ఐదు లక్షలు ముట్టినట్లుగా మరో లక్ష ఇస్తే భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని బాండ్ పేపర్‌లో రాసుకున్నారు. రాయమల్లు తీసుకున్న లక్షా యాభైవేల అప్పును కొద్ది నెలల క్రితమే పుల్లెల తిరుపతికి చెల్లించాడు. అప్పు చెల్లించినా పుల్లెల తిరుపతి, అతడి బంధువులు పుల్లెల అంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ అనే రాయమల్లును భూమి రిజిస్ట్రేషన్ చేయమని వేధింపు లకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రాయమల్లు గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఖాళీ బాండ్ పేపర్‌పై సంతకం చేయించు కొని మోసం చేయడమే కాకుండా భూమి పట్టా చేయాలని పుల్లెల తిరుపతి, పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు రాయమల్లు భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద



జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,895 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

- అడ్డుకున్న హోంగార్డు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓ మహిళ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు అడ్డుకోవడంతో ప్రాణపాయం తప్పింది. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అత్తింటి వారు వేధిస్తున్నారనే నెపంతో ఇటీవల మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. తల్లి సైతం మందలించడంతో పురుగుల మందు డబ్బాతో జమ్మికుంట బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులు చూస్తుండగానే పురుగుల మందు డబ్బా మూత తీసి తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆమె వద్ద పురుగుల మందు డబ్బా లాక్కోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది మహిళను స్టేషన్‌కు తీసుకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళ తల్లిని పిలిపించి అప్పగించారు.

భవనం పైనుంచి దూకిన కేజీబీవీ విద్యార్థిని

తీవ్ర గాయాలు

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: పాఠశాలలో ఉండలేనని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్లపల్లి అశ్విత శుక్రవారం రాత్రి పాఠశాల భవనం పైనుంచి దూకింది. ఈ సంఘటనలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బాలికను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లి మండలం జంజేరు గ్రామానికి చెందిన అశ్విత మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతి నుంచి చదువుతోంది. కొంత కాలంగా తాను పాఠశాలలో ఉండనంటూ తల్లిదండ్రులకు చెబుతోంది. ఈ క్రమంలో శుక్రవారం తరగతులు ముగిసిన అనంతరం భవనం మొదటి అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకింది. నడుముకు బలమైన గాయాలవడంతో ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థినులు ఏం చేస్తున్నారో గమనించకపోతే ఎలా అంటూ పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐ రమాకాంత్, ఎల్లాగౌడ్ వివరాలు తెలసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


చికిత్స పొందుతున్న అశ్విత

క్రైం కార్నర్

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడి యేట్ విద్యార్థి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్(18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని సిగ్మా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్‌చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ధర్మపురి, సెప్టెంబరు 20: ధర్మపురి మండలంలోని రాయపట్నం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ గంగుల మహేష్ తెలిపారు. సదరు వ్యక్తి 20 రోజుల నుంచి మతి స్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేవాడు. 10 రోజుల క్రితం గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి ఉండగా 108లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సదరు వ్యక్తి మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాయపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యుల వివరాలు తెలిస్తే పోలీసులకు తగు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

జ్వరంతో ఆరేళ్ల బాలుడి..

రాయికల్, సెప్టెంబరు 20 : రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాస మనీష్ (6) అనే ఆరేళ్ల బాలుడు జ్వరంతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజశేఖర్-లాస్య దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. నాలుగు రోజుల నుంచి ఇద్దరికీ జ్వరం రావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం పెద్ద కుమారుడు మనీష్‌కు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

బావిలోపడి రైతు..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌కు చెందిన బోనగిరి సత్తయ్య(51) ప్రమాదవశాత్తుగా వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్యకు ఫిట్స్ వ్యాధి ఉండగా మందులు వాడుతున్నాడు. గురువారం తన వ్యవసాయబావి వద్దకు సత్తయ్య, అతడి భార్య వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు అతని భార్య ఇంటికి వెళ్లగా సత్తయ్య బావి వద్ద విద్యుత్ మోటార్ బంద్ చేసేందుకు వేచి ఉన్నాడు. ఈ సమయంలోనే మూర్ఛవచ్చి ప్రమాదవశాత్తు జారి బావిలోపడి మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం సత్తయ్య ఇంటికి రాకపోవటంతో బావి వద్ద వెతకగా అతని చెప్పులు కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం ఉదయం బావిలోని నీటిని మోటార్ ద్వారా తోడగా బావిలో సత్తయ్య మృతదేహం కనపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట సెప్టెంబరు 20 : కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన కప్పు బాను (50)అనే వడ్రంగి అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్తన్‌పేటకు చెందిన బాను సుమారు రూ.5 లక్షల వరకు వెచ్చించి కట్టె కోత మిషన్ కొనుగోలు చేశాడు. కట్టెపని దొరకకపోవడం, మిషన్‌కోసం చేసిన అప్పుల మిత్తి పెరగడంతో మనోవేదన గురయ్యా డు. ఈ క్రమంలోనే అప్పులు ఎలా తీర్చాలో తెలియక గురువారం రాత్రి దూలానికి ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య బాలవ్వ, కుమారులు వెంకటేష్, భూమేష్ ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రం లోని కూనారం క్రాస్ రోడ్డు వద్ద కారును లారీ ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సిద్దిపేట సీఐ లక్ష్మిబాబు సస్పెన్షన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : గతంలో కరీంనగర్‌లో సీఐగా పనిచేసిన సమయంలో ఒక కేసుకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం ప్రస్తుత సిద్దిపేట సీఐ లక్ష్మిబాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం నార్త్‌జోన్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడాది కిందట కరీంనగర్‌లోని పలు ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సమయంలో కరీంనగర్‌లోని ఒక ఫైనాన్స్‌లో పోలీసుల దాడుల్లో లభ్యమైన డబ్బుల్లో 10 లక్షల నగదు తేడా రావటంతో ఈ వ్యవహారంపై సంబంధితులు ఐజీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఐజీ ఆదేశాలతో కరీంనగర్ పోలీస్‌కమిషనర్ విచారణ నిర్వహించి, నివేదిక అందజేయగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతుకాగా శుక్రవారం ఆచూకి లభ్యమైంది. ఆదిలాబాద్ జిల్లా ఊట్నూరుకు చెందిన సంపంగి శ్రీనివాస్(24) కొన్ని రోజులుగా జగిత్యాలలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చింతకుంట చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడం స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యం కాగా కేసు నమోదు చేశామన్నారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

టీషర్ట్స్ బుక్ చేస్తే ఖాళీ బాక్స్

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 : అమెజాన్ ఆన్‌లైన్ షాపింగ్‌లో రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేస్తే వట్టికి స్టిక్కర్ బొమ్మ వేసి డెలివరీ చేసిన సంఘటన ఇల్ల ందకుంట మండలం సిరిసేడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు రహ్మాన్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం. రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేయగా వాటికి బదులుగా ఖాళీ వట్టికి స్టిక్కర్లు వేసి డెలివరీ చేశారు. తను చేసిన టీషర్ట్స్ ఇంత చిన్న పరిమాణంలో ఉంటాయాన్న అనుమానంతో ప్యాకెట్ విప్పలేదు. దీనిపై అమెజాన్ యాప్‌లో ఐటమ్ రిటర్న్ పెట్టాడు. కొరియర్ బాయ్ రావడంతో అతని ముందే ప్యాకింగ్ ఓపెన్ చేశాడు. అందులో స్టిక్కర్ బొమ్మ వచ్చిందని బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారుల ఫోరంలో కేసు వేయనున్నట్లు తెలిపాడు.


ఆన్‌లైన్‌లో వచ్చిన అట్టను చూపుతున్న బాధితుడు రహ్మాన్‌ఖాన్

రేపు కరీంనగర్ హాఫ్ మారథాన్

3కె, 5కె,10కె,21కె విభాగాల్లో నిర్వహణ



కరీంనగర్ హాఫ్ మారథాన్ టీ షర్ట్‌లను ఓపెన్‌చేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న కరీంనగర్‌లో రెండవ ఎడిషన్ కరీంనగర్ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నట్లు మారథాన్ కమిటీ అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్ వివరాలను వెల్లడించారు.

రన్ ఫర్ హెల్త్, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతోపాటు కరీంనగర్ ప్రజలకు ఫిట్‌నెస్‌పై అవగాహన ఆరోగ్యం లక్ష్యంగా హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌లో మూడు కిలో మీటర్లు, 5,10, 21 కిలో మీటర్ల విభాగాల్లో నాలుగు కేటగిరీలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా యంత్రాంగం పోలీసు కమిషనరేట్, టూరిజంల ఆధ్వర్యంలో నిర్వహిసున్న ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 5వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిని మాత్రమే మారథాన్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని చెప్పారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, ప్రతిమ మల్టీప్లెక్స్, తెలంగాణచౌక్, పద్మనగర్ మీదుగా ఎల్ఎండీ నుంచి తిరిగి అంబేద్కర్ స్టేడియం వరకు సాగుతుందని తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరికి టీషర్ట్స్‌ను అందజేస్తామని మహేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, పురుషులు, మహిళలు పాల్గొనే ఈ మారథాన్‌లో 21కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 10వేలు, సెకండ్ ప్రైజ్ 7వేల 500, థర్డ్ ప్రైజ్‌గా 5వేలు, 10కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 7వేలు, సెకండ్ ప్రైజ్ 5వేలు, థర్డ్ ప్రైజ్‌గా 3వేలతో పాటు మెమోంటోలు అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం టీషర్ట్స్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ డిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన

చందుర్తి, సెప్టెంబర్ 20: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మల్యాల, సనుగుల సబ్ సెంటర్‌లో టీబీ నివారణపై శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్ జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అధిక సంఖ్యలో కేసులు మన ఇండియాలోనే నమోదు అవుతున్నాయన్నారు. దీని ద్వారా మరణాల సంఖ్య అధికంగా ఉందన్నారు. టీబీ అనే మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటని అన్నారు. టీబీ బారిన పడి ఆ వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ నిర్వహించి, వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ శశికల, ఎంఎల్‌హెచ్‌పిలు డాక్టర్ ఐశ్వర్య, నవీన్, సూపర్వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు రమాదేవి, పద్మ, మమత, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


సనుగులను సందర్శించిన టీబి అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్ ; సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణ, క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం, కాంగ్రెస్, మనువాద పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో వందకుపైగా రివ్యూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా రేవంత్ సర్కార్ వర్గీకరణకు కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. కమిటీని వెంటనే రద్దుచేయాలన్నారు. సెప్టెంబరు 30న ఛలో హైదరాబాద్ సచివాలయం ముట్టడికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పసుల రాజలింగం, ఆర్ల రమేష్, యనమల మంజుల, బద్దం డేనియల్, రాగి రాజేష్, తీగల శేఖర్, శ్రీని వాస్, నిచ్చికోల రాంచందర్, లింగాల జలపతి, చిప్పరి కరుణాకర్, పిట్ల ఈశ్వర్, దుగుట రాజు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ రేషన్ కార్డుల జారీకి సర్కార్ కసరత్తు

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్ సెప్టెంబరు 20: రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన కుటుంబాలకు త్వరలో డిజిటల్ రేషన్‌కార్డులను అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీకి మార్గం సుగమమైందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. అక్టోబరు 2వ తేదీ నుంచి కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరణ చేపడతామన్నారు. అక్టోబర్ నెలాఖరులోగా అర్హుల జాబితాను ప్రకటించి లబ్ధిదారులకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన పేద కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

అల్ఫోర్స్ అధినేతకు యూనివర్సల్ ఐకాన్ అచీవర్ అవార్డు



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భగత్‌నగర్, సెప్టెంబరు 20: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డికి యూనివర్సల్ ఐకాన్ అచీవర్2024 అవార్డు వరించింది. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో విద్యనందిస్తున్నందుకు యుఏఈకి చెందిన జెనటిక్స్ అల్టిమా వారు అల్ఫోర్స్ అవలంబిస్తున్న విద్యవిధానాలకు యూనివర్సల్ ఐకాన్ ఆచీవర్ అవార్డు 2024 ప్రకటించిందన్నారు. సంస్థ ప్రతినిధి ద్వారా అవార్డును పంపించారని, అవార్డురావడానికి కృషి చేసిన పరిపాలన విభాగం వారికి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తల్లిదండ్రులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 20: స్వచ్ఛ సర్వేక్షణ్-24లో భాగంగా శుక్రవారం నగరంలోని ఎస్‌వీజేసీ బాలికల జూనియర్ కళాశాలలో కార్పొరేటర్ మేచినేని వనజ అశోక్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, పర్యావరణ ఇంజనీర్ స్వామి స్వచ్ఛత హీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సహకరిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ దిండిగాల మహేశ్, సానిటరీ గట్టు శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

గణేష్‌నగర్: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వావిలాలపల్లి, బ్యాంక్‌కాలనీ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని రక్షించే విధంగా కాలనీల్లో అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్, బైరం మహేష్, ఏసిఓ బి సంపత్‌కుమార్, ఏవో బి శ్రవణ్‌కుమార్, రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వలంటీర్లు స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరపు రజిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గొబ్బెట తిరుపతి, కో-ఆర్డినేటర్ పోతిరెడ్డి హరీష్ పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, మున్సిపల్ కార్యాలయం మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ గ్రామంలో జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రధాన వీధుల్లో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం పాఠశాలలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, యూనిసెఫ్ జిల్లా కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

31 అంశాలకు ఆమోదం

- మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం


ఏజెండాలోని అంశాలు చదువుతున్న అధికారులు

జమ్మికుంట, సెప్టెంబరు 20: జమ్మికుంట మున్సిపాలిటీలో చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 31 అంశాలకు ఆమోదం తెలిపారు. కాగా సమావేశానికి 30మంది కౌన్సిల్ సభ్యులకు గాను 22మంది హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ అధికారులు ఏజెండా కాపీలోని 31 అంశాలను కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. వీటిలో సద్దుల బతుకమ్మ, దసరా పండగకు ఏర్పాట్లు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వాహనాల మరమ్మతులు, గణేశ్ నిమజ్జనం తదితర ఖర్చుల వివరాలకు సంబంధించిన బిల్లుల ప్రాతిపాదనలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే పూర్తి చేసి ఉన్న పనులకు చెల్లించాల్సిన నగదు వివరాలను పొందు పరిచారు. కిందటి సమావేశంలో ఒక్కో వార్డు అభివృద్ధికి ఐదు లక్షల రూపాయలు కేటాయించారు. ప్రస్తుతం మళ్లీ ఒక్కో వార్డుకు నాలుగు లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించారు. దీంతో కౌన్సిల్ సభ్యులు సైతం హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ నరేష్, టిపివో శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ సభ్యులకు సన్మానం

రామడుగు, సెప్టెంబరు 20: మండలంలోని రంగసాయిపల్లి గ్రామ బీజేపీ బూత్ కమిటీ సభ్యులను శుక్రవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సన్మానించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 80 శాతానికి పైగా ఓట్లు వచ్చిన సందర్భంగా బూత్ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు మునిగంటి శ్రీనివాసచారి, మండల శేఖర్, బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, శక్తి కేంద్రం ఇంచార్జీ కట్టా రవీందర్, మాజీ మండలాధ్యక్షులు జిట్టవేణి అంజిబాబు, నీలం రవి, లింగంపల్లి శ్రీనివాస్, మండల కనకయ్య, బసని శేఖర్, నీలం శ్రీరామ్, మండల అభిలాష్, మండల తిరుపతి, మండల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలకు కుర్చీలు అందజేత

జమ్మికుంట, సెప్టెంబర్ 20: జమ్మికుంట పట్టణ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన బీజేపి నాయకులు శ్రీసరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు రూ.10వేల విలువ గల ప్లాస్టిక్ కుర్చీలను శుక్రవారం అందజేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదైన ప్రాంత నాయకులకు నగదు పారితోషకం ఇస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ప్రకటించారు. ఈ మేరకు. వచ్చిన డబ్బులతో కుర్చీలు కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల కిషన్, రావుల షైపాల్, పొనగంటి రవికుమార్, ఆవాల రాజిరెడ్డి, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, బచ్చు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త వేయొద్దు

గంగాధర, సెప్టెంబరు 20: గ్రామస్థులు వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని జడ్పీసీఈవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 20: తెలంగాణ ప్రాంత ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి బతుకమ్మ ఆడే పాయింట్లను నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలించారు. తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ బతుకమ్మ పాయింట్లను, బతుకమ్మ నిమజ్జనం రూట్ మ్యాప్, ప్యాచ్ వర్క్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. బతుకమ్మ పండుగకు సంబంధించిన పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించామని, త్వరలోనే పనులు ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పండుగకు ముందే పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ అయూబ్‌ఖాన్, వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గడువులోగా 'స్మార్ట్' పనులు పూర్తి చేయాలి

నగరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపడుతున్న అభివృద్ధి పనులన్నిటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో చేపడుతున్న స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. మల్టీపర్పస్ పార్క్, రాజీవ్ పార్క్, పద్మనగర్ సమీకృత మార్కెట్‌ను సందర్శించారు. మల్టీపర్పస్ పార్కు సుందరీకరణలో భాగంగా చేపట్టిన మ్యూజికల్ ఫౌంటేన్, ఆంఫీథియేటర్, గజీబో, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే పరికరాలను పరిశీలించారు. రాజీవ్ పార్కులో వాకింగ్ ట్రాక్, గజీబో, లాండ్ స్కేపింగ్, గ్రీనరీ పనుల ను పరిశీలించి పలుఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది దశకు చేరుకున్న మల్టీపర్పస్ పార్క్, రాజీవ్ పార్క్, పద్మనగర్ సమీకృత మార్కెట్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ఆర్వీ అధికారులు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రూరల్ ఏసీపీపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: ఉద్దేశపూర్వకంగా కేసును మూసివేసిన రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని రామడుగు మండలం కిష్టంపల్లికి చెందిన గొల్లపల్లి లచ్చయ్య కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. కేసుకు సంబంధించిన వీడియో రికార్డులు, ఫొటోలు ఉన్నప్పటికి రూరల్ ఏసీపీ ఫాల్స్ కేసు అని మూసివేశారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమ్మె విరమించిన ఆరోగ్య మిత్రలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా ఆరోగ్య మిత్రలు చేస్తున్న సమ్మెను శుక్రవారం విరమించారు. ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని జీవో 60 ప్రకారం వేతనాలు 22,750 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యమిత్ర జీతభత్యాలను ఔట్‌సోర్సింగ్ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ నుంచి చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు విధానాన్ని మార్చాలని, తదితర డిమాండ్లతో సమ్మె చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు ప్రకటించారు.

విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, సెప్టెంబరు 20: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ వన్, టౌన్ టు, రూరల్ ఏడీఈలు సాయివేనేని నరేందర్, సుధీర్‌కుమార్, కోలుపుల రాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఎస్ఆర్ఆర్ కళాశాల, పద్మనగర్, సప్తగిరి, భగత్‌నగర్ పరిధిలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్‌సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8.30 నుండి 11.30 వరకు అంబేద్కర్‌నగర్, వావిలాల పల్లి, బ్యాంక్‌కాలనీ, వాటర్‌వర్క్స్, (హౌజింగ్‌బోర్డు) విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 నుండి 12 వరకు భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఎన్జీవోస్‌కాలనీ, ఎర్రగుంటపల్లి, కట్టరాంపూర్ ఏరియా, అంబేద్కర్ స్టేడియం, కలెక్టరేట్ కాంప్లెక్స్ ఏరియా, బస్టాండ్‌ఏరియా, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్, తిర్మల్‌నగర్, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, దోబీవాడ, కమాన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు కొత్తపల్లి ముక్తుంపూర్, నగునూరు, మధ్యాహ్నం 3 గంటలనుండి 5 గంటల వరకు రేకుర్తి, బొమ్మకల్, చర్లబూత్కూర్, శాతవాహన యూనివర్సిటీ, పరిధిలో విద్యుత్ ఉండదని తెలిపారు.

అభివృద్ధి పనుల అంచనాలు తయారు చేయండి

- 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 20: అభివృద్ధి పనులపై అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సుడా కార్యాలయంలో చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధికారుల సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. కమర్షియల్ బిల్డింగ్స్ పర్మిషన్ చార్జీల వసూళ్ళను పకడ్బందీగా చేపట్టాలని, నిర్లక్ష్యం చేస్తే లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోతామని, వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా మంత్రుల సమయం తీసుకొని మాస్టర్ ప్లాన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనులపై అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరగా పూర్తిచేయాలని, అక్యూపేషన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా తీసుకోవాలని లేనిపక్షంలో ఎలాంటి శాశ్వత వసతులు కల్పించరాదని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీపీవో రవీందర్, చీఫ్ ప్లానింగ్ అధికారి కోటేశ్వర్, డీటీసీపీ ఆంజనేయులు, ఈఈ యాదగిరి, డీఈ రాజేంద్రప్రసాద్, సుడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సిక్కులపై మారణకాండ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గణేష్‌నగర్, సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నకాలంలోనే సిక్కులపై మారణకాండలు జరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బల్బీర్‌సింగ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమెరికా పర్యటనలో ఉన్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సిక్కులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో సిక్కులు తమ తలపాగాలు, కడలను ధరించగలరా, గురుద్వారాలను సందర్శించడానికి అనుమతిస్తారా అని రాహుల్ గాంధీ అమెరికాలో ఎందుకు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. విదేశాల్లో సున్నితమైన అంశంతో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దేశంలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లు ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సిక్కులపై మారణకాండ జరిగిన విషయం రాహుల్‌కు గుర్తులేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బల్బీర్‌సింగ్, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, నాయకులు నాంపల్లి శ్రీనివాస్, ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, ఎన్నం ప్రకాశ్, వరాల దేవేందర్, పెంట శ్రీనివాస్, వాసు, మామిడి చైతన్య, మైనార్టీమోర్చా నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


గన్నేరువరంలో అన్నప్రాసన, సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో శ్రీమతి

గన్నేరువరం, సెప్టెంబరు 20: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పోషణమాసం సందర్భంగా శుక్రవారం సభ నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపం లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతి ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకొని సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్ర మంలో మండల వైద్యాధికారి ఉపేందర్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం లావణ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇస్రత్ సుల్తానా, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రణీత, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు మారుతీనగర్ సెక్టార్ పరిధిలోని మారుతీనగర్ 1, 2, మంగళివాడ-12 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం శుక్రవారం సభ, పోషణ మాసం అవగాహన సభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. . 30వ డివిజన్ కార్పొరేటర్ నేతికుంట యాదయ్య అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆర్యోగ, పౌష్టికాహార సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రసాన నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సతీష్, సీవో స్వప్న, ఎఎన్ఎంస్, ఆర్‌పీలు అంగన్‌వాడీ టీచర్ ఉమ, విజయలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. నేదునూర్‌లో శుక్రవారం కిషోర బాలికల పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్ కిషోర బాలికల్లో రక్తహీనత తలెత్తకుండా తీసుకోవల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అన్నప్రాసన, అక్షరాభ్యాసం పోషణ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సురేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, డాక్టర్ జవేరియా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు.. డీఆర్డీవో వి శ్రీధర్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త, గర్భిణులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మొలంగూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తహసీల్దార్ భాస్కర్, ధర్మారంలో ఎంపీవో ప్రభాకర్ పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్రవంతి, కవిత పాల్గొన్నారు.

రామడుగు: సంపూర్ణమైన పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు.రంగసాయిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రసన నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నర్సింగరాణి, సూపర్‌వైజర్ సుధారాణి, డాక్టర్ అరుణ, ఐసీపీఎస్ కో ఆర్డినేటర్ కవితదేవి పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల సందర్శన

చొప్పదండి, సెప్టెంబరు 20: మండలంలోని పెద్దకుర్మపల్లి గ్రామానికి చెందిన ఉత్తమ రైతు మావురం మల్లికార్జున్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లాలోని ఇన్‌పుట్ డీలర్లు గురువారం సందర్శించారు. దేశి కార్యక్రమంలో భాగంగా ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో ఈ క్షేత్ర సందర్శనను నిర్వహించారు. సేంద్రియ సాగు నూతన వరి వంగడాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ, ఆత్మ పీడీ చతుర్ నాయక్,ఫెసిలిటేటర్ రాంచంద్రరావు, వ్యవసా యాధికారి మమత. జిల్లాకు చెందిన 40 మంది డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల సమ్మె

హుజూరాబాద్, సెప్టెంబరు 20: హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులలో 15మంది ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను మున్సిపల్ పాలకవర్గం తొలగిస్తున్నారని సమాచారం తెలియడంతో ఒక్కసారిగా వారంతా విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 142మంది ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నామన్నారు. అందులో 12మంది పారిశుధ్య పని కాకుండా ఇతర పనులకు వినియోగిస్తున్నారన్నారు. 15మందిని తొలగించి వారి స్థానం లో కొత్త వారికి అవకాశం కల్పించి తమ పొట్ట కొట్టడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ కార్మికులను ఎవరిని తొలగించే ఉద్దేశం లేదన్నారు. విధులకు హాజరు కాని వారిని మందలించేందుకేనని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

కోతకు గురవుతున్న కాలువ


దెబ్బతిన్న కాలువ

గంగాధర, సెప్టెంబరు 20: గంగాధర మండలం ర్యాలపల్లి శివారులోని లింక్ కాలువ కోతకు గురవుతోంది. ర్యాలపల్లి శివారు నుంచి వరద కాలువను మల్యాల మండలం తాటిపెల్లి కాకతీయ కాలువకు లింక్ కెనాల్ ఏర్పాటు చేసి నీటిని విడుదల చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కాలువ పనులు పూర్తయ్యాయి. ఎనిమిది నెలల క్రితం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. నీటి ఉధృతికి ర్యాలపల్లి లింక్ కెనాల్ ఎనిమిది వందల మీటర్ల వద్ద కోతకు గురవుతోంది. గండిపడితే నీరు చేలల్లోకి చేరి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టరు కాలపరిమితి పూర్తవడంతో ఇటీవల నిర్వహణ బాధ్యతను అధికారులకు అప్పగించారు. కాలువ కోతకు గురవకుండా సిమెం టు లైనింగ్ వేయాలని కాంట్రాక్టర్‌ను కోరినా ఎస్టిమేషన్‌లో లేదని వదిలి వేసినట్లు రైతులు చెబు తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన వన్‌టౌన్ సీఐ



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20: కరీంనగర్ ఒకటో ఠాణా సీఐగా నియామకమైన బిల్ల కోటేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన సరిలాల్ నుంచి కోటేశ్వర్ బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా వన్‌టౌన్ సీఐగా విధుల్లో చేరిన కోటేశ్వర్‌కు పలువురు పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

బండ నరేశ్‌కు డాక్టరేట్

గణేశ్‌నగర్, సెప్టెంబర్ 20: శాతవాహన విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బండ నరేశ్‌కు డాక్టరేట్ లభించింది. రోల్ ఆఫ్ రీజినల్ రూరల్ బ్యాంక్స్ ఇన్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ఏ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ గ్రామీణ బ్యాంకు అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె శ్రీనివాస్ పర్యవేక్షణలో కామర్స్ విభాగం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గణేశ్‌నగర్, సెప్టెంబర్ 20: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో తరగతులు నిర్వహించని డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌యూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యార్థుల నుంచి ప్రవేశాలు మాత్రమే తీసుకొని తరగతులను నిర్వహించకుండా చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే తరగతులు నిర్వహించని కళాశాలలపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, గణేశ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు అభిలాష్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

'మాడిశెట్టి'ని సన్మానించిన మేయర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 20: ఇటీవల ఎల్ఐసీ సంస్థలో పదవీ విరమణ పొందిన వ్యాఖ్యాత, రచయిత మాడిశెట్టి గోపాల్‌ను శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి మేయర్ యాదగిరి సునీల్‌రావు సన్మానించారు. అమెరికాలో ఉన్నందున తాను కలువలేక పోయానని మేయర్ పేర్కొన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు మాడిశెట్టిని సన్మానించారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ రూరల్: బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఏఈవోలను జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాల యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కొత్తపల్లి ఏవో రంజిత్ బదిలీ కాగా, కొత్తగా వచ్చిన కృష్ణ, చామన పల్లి ఏఈవో అనుజ్ఞ స్థానంలో సుచరిత, మల్కాపూర్ ఏఈవో లలిత స్థానంలో తిరుపతి, సీడ్ ఫార్మ్ ఏఈవో ప్రణయ్ స్థానంలో ఉదయ్ బదిలీపై వచ్చారు. ఏఈవోలకు సన్మానం చేసి మెమోంటోలను బహుకరిం చారు.

● భగత్‌నగర్: నగరంలోని 21వ డివిజన్ సీతారాంపూర్ సూర్యనగర్‌లో రోడ్డుకు సొంత ఖర్చులతో బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్ మరమ్మతులు చేప ట్టారు. వర్షాలు పడిన ప్రతీసారి రోడ్డుపై గుంతలు పడుతుండడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రోడ్డుపై మొరం పోసి గుంతలను పూడ్చి వేశారు.

● కరీంనగర్ క్రైం: మూడు నెలలుగా డీపీవో, ఎంపీవో, అధికారులు తనకు సహకరించడలేదని, పద్ధతిగా అధికారులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రామడుగు తాజా మాజీ సర్పంచ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

● గణేశ్‌నగర్: నగరంలోని శివనగర్ అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం సభ సందర్భంగా మహిళలకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ స్వప్న, చైల్డ్ హెల్ప్‌లైన్ మెంబర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా నాలుగు వేల క్యూ సెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.214 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఏనుగు రవీందర్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి అన్నారు. స్థానికంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

● రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని కన్నం రమేశ్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పీడీ దత్తాత్రేయ శర్మ సారథ్యంలో రాణించారని తెలిపారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించడాన్ని హర్షిస్తూ శుక్రవారం పద్మశాలి సంఘం నాయకులు సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంగెం సత్యనారాయణ, చిలుకమారి శ్రీనివాస్, బండారి సదానందం, ఆడిచెర్ల శ్రీనివాస్, ముషం గణేష్, చేరాల మనోహర్, కొక్కుల సమ్మయ్య, కూరపాటి రామచంద్రం, జడల అశోక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● సైదాపూర్: హుస్నాబాద్ పట్టణంలోని పోతారం (ఎస్)లో శనివారం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

● శంకరపట్నం: కాచాపూర్‌కు చెందిన ఊకంటి సన్నిహిత ఈ నెల 15న కరీంనగర్‌లో నిర్వహిం చిన జాతీయ కరాటే పోటీల్లో రజత పతకం సాధించడం తో శుక్రవారం కేశవపట్నం ఎస్ఐ రవి అభినందించారు. సన్నిహితను శాలువాతో సన్మానించారు.

● హుజూరాబాద్: పట్టణంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● జమికుంట రూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, టిఎంసి మానస, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, సిఎల్ఆర్పీలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

- జమ్మికుంట పట్టణంలో దళితబంధు రెండో విడుత నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరుతూ దళిత బంధు కాంగ్రెస్ పార్టీ సాధన సమితి సభ్యులు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్ తిప్పారపు సంపత్, సుంకరి రమేష్, పుల్లూరి సదానందం, రాజ్‌కుమార్, భద్రయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.